సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి



80 అడుగుల రహదారిలో పూర్తయిన డివైడర్



89వ వార్డులో తుది దశకు చేరుకున్న పట్టణ ఆరోగ్య కేంద్రం

పశ్చిమ.. ప్రగతి పథాన..



సుందరంగా తీర్చిదిద్దిన శాంతినగర్ పార్క్



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న జియ్యాని శ్రీధర్

- మారుతున్న నియోజకవర్గ రూపురేఖలు
- సుందరంగా రోడ్లు
- పార్కుల్లో మౌలిక వసతులు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోంది. రోడ్లతో పాటు పార్కులు, కాలువల అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే కోట్లాది రూపాయిలతో పనులు పూర్తయ్యాయి. మరి కొన్ని ప్రగతిలో ఉన్నాయి.శ్మశాన వాటికలు, పార్కులు కొత్త రూపు సంతరించుకున్నాయి. మొత్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో నియోజకవర్గం రూపురేఖలు మారుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన పనులు కూడా చాలా వరకు పూర్తి చేశారు. నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అవసరమైన చోట తన సొంత నిధులు వెచ్చించి పేదలకు భరోసా కల్పిస్తున్నారు.

నియోజకవర్గం పరిధిలో..

➡ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.3.20కోట్లతో 50 పనులు చేపట్టారు.

➡ ఇతర నిధులు సుమారు రూ.35 కోట్లతో 212 పనులు మంజూరయ్యాయి. వీటిలో సగం పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

52వ వార్డులో..

వార్డు పరిధిలో శాంతినగర్, మర్రిపాలెం వుడాలేఅవుట్, సంజీవయ్యనగర్, గౌరీనగర్, గణేష్ నగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. హిందూ క్రిస్టియన్ ముస్లిం శ్మశాన వాటికల అభివృద్ధి పనులు చివరి దశకు వచ్చాయి. వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

నూతనంగా నిధులు మంజూరైన ప్రాంతాలు

➡ కరాసాలో సీసీ రోడ్లు , డ్రైన్స్, శ్మశాన వాటిక, ప్రధాన కాల్వ పనులకు రూ.1.20 కోట్లు

➡ గౌరీనగర్‌లో సీసీ డ్రైన్స్‌కు రూ.13లక్షలు

➡ శాంతినగర్‌లో బీటీ రోడ్లు, సీసీ డ్రైన్స్ పనులకు రూ.75.78లక్షలు

➡ మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో డ్రైన్స్, బీటీ రోడ్లు, ప్రధాన కాల్వల పనులకు రూ.1.78 కోట్లు

15వ వార్షిక ప్రణాళిక నిధులతో..

అంతే కాకుండా 15వ వార్షిక ప్రణాళిక సంఘం నిధులతో ఎస్‌ఎస్‌ఎల్ ఎదురు జిందాల్ భవనం నుంచి మర్రిపాలెం వుడాలేఅవుట్ వరకు 80 అడుగుల రహదారిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు రూ.1.60 కోట్లతో చేపడుతున్నారు. ప్రస్తుతం డివైడర్ పనులు పూర్తయ్యాయి. బీటీ రోడ్డు వేసిన తర్వాత డివైడర్ సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

సీఎంకు భారీ స్వాగతానికి ఏర్పాట్లు

పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ముఖ్య నేతలతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం విశాఖ రానున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జీవీఎంసీ 52వ వార్డులోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం నుంచి నియోజకవర్గం పరిధి వరకు జాతీయ రహదారిలో నిల్చొని ఘన స్వాగతం పలుకుదామన్నారు. ప్ల కార్డులు, పూలతో స్వాగతం పలకాలని తెలిపారు. ప్రతీ వార్డు నుంచి కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రావాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన డెంగ్యూ మాసోత్సవాలు



డెంగ్యూ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవికుమార్

సింధియా: జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్త ంగా నిర్వహించిన డెంగ్యూ మాసోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా 62వ వార్డు త్రినాథపురం(దుర్గానగర్) జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థులకు డెంగ్యూ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం తీసుకునే చర్యలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించి, విశాఖ నగరాన్ని సీజనల్ వ్యాధుల రహిత నగరంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రజలు తడి-పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చునని, ప్రజలందరు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. డెంగ్యూ కారక దోమలు మంచినీటిలోనే ఉత్పన్నమవుతాయని, 3 రోజులకు ఒకసారి మంచినీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి, భవాని(ఎంటీఎస్), హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, హెల్త్ సెక్రటరీ రమ్య, సత్యవతి, ఇతర జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

114 సర్వే నంబర్‌లో అధికారుల సర్వే



కొత్తపాలెం 114 సర్వే నంబర్ స్థలంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు సర్వే నంబర్ 114లో గోపాలపట్నం రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. 2015లో ల్యాండ్ గ్రాబింగ్ కేసు నమోదైన నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేపట్టామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ స్థలమే ఉందని... ఇది గతంలో అన్యాక్రాంతమైందన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా ఇదే స్థలంలో పలు మార్లు సర్వే చేపట్టారు. అయితే ఇంతవరకు వాటి వివరాలు మాత్రం అధికారులు బయటకు వెల్లడించలేదు. ఇటీవల కొందరు వ్యక్తులు ఈ స్థలం తమది అంటూ రావడంతో స్థానికంగా దీనిపై ఆసక్తి నెలకొంది.

6న భువనేశ్వరీదేవి అధివాసం



భువనేశ్వరీదేవి అమ్మవారు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు పెదయాతపాలెం చెల్లయ్యమ్మ తోటలో కొలువైన భువనేశ్వరీదేవి అధివాసం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్టు శ్రీభువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం రోజులకు ఒకసారి నిర్వహించే ఈ అధివాసంలో ఒక్కో పత్రితో పూజలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా 6వ తేదీన బిళ్ల గన్నేరు పత్రితో అమ్మవారిని పూజించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్టు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

ఉక్కు ఉద్యమంలో మరో మైలురాయి

- 900వ రోజుకు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం, కార్మికుల భవిష్యత్తు కోసం 900 రోజులుగా చేస్తున్న దీక్షలు మరో మైలురాయిని చేరుకున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. దేశ చరిత్రలోనూ ఈ ఉద్యమం నిలిచిపోతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 900వ రోజు సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

త్వరితగతిన ప్రజా వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలు సమస్యలపై 06 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు పరిష్కార నిమిత్తం అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, రెవెన్యూకు 02, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ చిరంజీవి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

పొట్టిమూర్తిని పరామర్శించిన ఆడారి



పొట్టి మూర్తిని పరామర్శిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఇటీవల ప్రమాదానికి గురైన 59వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు పీల వెంకటరమణ మూర్తి (పొట్టి మూర్తి)ని సోమవారం పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆయన ఇంటి వద్ద పరామర్శించారు. ఇటీవల సినిమా షూటింగ్‌కు వెళ్లిన సందర్భంలో హైదరాబాద్‌లో ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వేగంగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆనంద్ ఆకాంక్షించా రు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవే టు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సోషల్ మీడి యా కో కన్వీనర్ కిరణ్ కుమార్‌రెడ్డిని ఆనంద్‌కుమార్ పరామర్శించారు. ఏవిధమైన సహకారం అవసరమైనా తనను సంప్రదించాలని సూచించారు.

పీవీ సత్యనారాయణకు ప్రముఖుల నివాళి



పీవీ సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సింధియా: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ తండ్రి పిండి వెంకట సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. సోమవారం నిర్వహించిన సత్యనారాయణ సంతాప సభలో పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, చింతలపూడి వెంకటరామయ్య, పారిశ్రామికవేత్త సీతంరాజు సుధాకర్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

విమానాశ్రయంలో హవల్దార్ మృతదేహానికి నివాళి



విమానాశ్రయంలో హవల్దార్ శ్రీనివాసరావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఆర్మీ, నేవీ అధికారులు

గోపాలపట్నం: తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం పేకేరు గ్రామానికి చెందిన హవల్దార్ పిట్టా శ్రీనివాసరావు భౌతిక కాయం సోమవారం ఉదయం విశాఖ విమానాశ్రయానికి చేరుకుంది. ఆయన మృత దేహానికి ఆర్మీ, నేవీ, ఎన్‌సీసీ, జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయ ప్రతినిధులు, నగర పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. మృతుడు పిట్టా శ్రీనివాసరావు 16వ మద్రాస్ రెజిమెంట్‌లో హవల్దార్‌గా విధులు నిర్వహించేవారు. విమానాశ్రయం నుంచి ఆర్మీ వాహనంలో స్వగ్రామానికి తీసుకెళ్లారు.

బైక్‌పై వెళ్తూ మూర్ఛతో వ్యక్తి మృతి



మృతి చెందిన ఎల్లంకి శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధికి గురై మృతి చెందిన ఘటన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఎల్లంకి శ్రీనివాస్(44) ఓ లిఫ్ట్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం శ్రీనివాస్ గాజువాక నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి మూర్ఛ రావడంతో హఠాత్తుగా తన వాహనాన్ని నిలిపి పక్కకు ఒరిగిపోయాడు. కొద్ది సేపటికే మృతి చెందాడు. పలువురు ఆయనకు సపర్యలు చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.

శ్రీవారికి వెండి కుందుల బహూకరణ



వెండి కుందులను తీసుకొస్తున్న మావూరి వెంకటరమణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు విలువ చేసే వెండి కుందులను బహూకరించారు. మంగళవాయిద్యాల నడుమ వెండి కుందులను తీసుకొచ్చి అంతరాలయంలో శ్రీవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్



రొనాల్డ్ విలియమ్స్

బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రొనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కృపానంద కుమార్, విజయ్‌ప్రధాన్ ఎన్నికయ్యారు.

దువ్వాడ రైల్వేస్టేషన్ పరిశీలన



దువ్వాడ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, వసతులను వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పరిశీలించారు. సోమవారం ఆయన దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. ప్రయాణికుల వెయిటింగ్ హాల్, కార్యాలయాలు, టికెట్ కౌంటర్, ఫుట్ ఓవర్ వంతెన, వాడకం నీటి ఔట్‌లెట్లను తనిఖీ చేశారు. వ్యాపారులు, ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు, వసతులపై ఆరా తీశారు. సిబ్బందితో ముచ్చటించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పీకే మహరాణా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్.రఘువీర్ పాల్గొన్నారు.

17 నుంచి శ్రావణ మాస పూజలు



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: కనమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణమాస పూజలు జరగనున్నాయి. నెల రోజులూ పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో రెండు విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేష వస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజలో పాల్గొనలేని భక్తుల గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటికి పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్ర స్థాయిలో ఉండటం, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా బోటు షికారు నిలిపివేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.

'స్టార్ ఆంధ్రప్రదేశ్' విజేత శైలజ

మహారాణిపేట: వివిధ రంగాల్లో ప్రతిభా కౌసల్యం ప్రదర్శించిన విశాఖపట్నానికి చెందిన పీసుపటి శైలజ అందాల శ్రీమతిగా ప్రథమ స్థానంలో నిలిచింది. నగరంలో ఓ హోటల్‌లో సోమవారం స్టార్ ఆంధ్రప్రదేశ్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విజ్ఞానం, వికాసం, కౌసల్యం, భాషపై పట్టు తదితర అంశాల్లో జడ్జిలు అడిగిన అన్ని ప్రశ్నలకు శైలజ చక్కగా సమాధానం చెప్పి అందాల శ్రీమతి కిరీటాన్ని దక్కించుకున్నారు. పోటీలకు ముఖ్యఅతిథులుగా మిస్ ఇండియా సంతోషిని, మిస్టర్ ఒలింపియా అరుణ్ పాల్, బిగ్‌బాస్ ఫేమ్ అనీల్ రాథోడ్ హాజరయ్యారు. స్టార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు నందిని గొల్లూరి, రోహిత్ సువ్వాడ ఈ పోటీలు నిర్వహించారు.

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నేడు



రమాసహిత సత్యనారాయణస్వామి

దాబాగార్డెన్స్: అధిక శ్రావణ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ మహలక్ష్మీ నగేష్ తెలిపారు. భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొనాలని, సత్యదేవుడిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. విశేష పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. భక్తులు ప్రదక్షిణ చేసేందుకు, విశేష వ్రతాచరణకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు నేతృత్వంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

గంగవరం యాజమాన్య వైఖరిపై కార్మికుల ఆగ్రహం

'చలో గంగవరం' కార్యక్రమానికి తరలిన అఖిలపక్షాలు



చలో గంగవరం పోర్టు సందర్భంగా చేపట్టిన ర్యాలీలో అఖిలపక్ష కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌పై గంగవరం పోర్టు యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరిపై ఉక్కు కార్మిక వర్గం పెద్ద ఎత్తున నిరసన తెలిపింది. కార్మికుల విషయంలో యాజమాన్యం వైఖరిని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున చలో గంగవరం నిర్వహించారు. గంగవరం పోర్టు ఇటీవల స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కోల్ షిప్‌లకు బెర్తులు కేటాయించకుండా ఆపివేసింది. కేవలం రూ. 50 కోట్ల కోసం ఉక్కు ఉత్పత్తికి అంతరాయం కలిగే ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. ఈ నేపథ్యంలో గంగవరం పోర్టు వైఖరిని అన్ని కార్మిక సంఘాలు ముక్త కంఠంతో ఖండించాయి.

సాయంత్రం 4 గంటలకు గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరికి నిరసనగా నిర్వహించిన స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు. గంగవరం పోర్టుకు వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఇదే వైఖరి కొనసాగిస్తే గంగవరం పోర్టు వాహనాలను రోడ్డుపైకి రాకుండా అడ్డుకుంటామన్నారు. అప్పుడు గంగవరం పోర్టును ఎలా నడుపుతారో తాము చూస్తామని వారు హెచ్చరించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. నర్సింగరావు, అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టం పజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా! లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

వైజాగ్ వెస్ట్

8978872250

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com